

ఎమ్మెల్యే మల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మారెడ్డిపాలెం కాలనీవాసులు

కాలనీ సమస్యలు పరిష్కరించండి

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 10(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ లక్ష్మారెడ్డిపాలెం కాలనీవాసులు గురువారం మాజీ కౌన్సిలర్ సిద్దంకి కృష్ణారెడ్డి, కాలనీ అధ్యక్షుడు గోవింద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. పాత డ్రైనేజీ పైప్‌లైన్‌ను మార్చాలని, ఇళ్ల మధ్యలో ఉన్న ఫార్మా కంపెనీని అక్కడి నుంచి తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. క్యాండర్ ప్రైస్ స్కూల్ నుంచి వెలుబడుతున్న మైకుల శబ్దంతో తీవ్ర ఇబ్బంది కలుగుతుందన్నారు. వీటికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ గౌరవ అధ్యక్షుడు బాబురావు, ప్రధాన కార్యదర్శి మజీద్‌బాబా, ఉపాధ్యక్షుడు శివనాగరాజు, రాజు, సంపత్, శ్రీనివాసరావు, కృష్ణారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, సురేష్, బాబు, శ్రీనివాస్, గోపాల్‌రావు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి: బలాల



వైద్య శిబిరంలో ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్

చాదర్‌ఘాట్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, అందుకు ఉచిత వైద్య పరీక్షా శిబిరాలను కూడా సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. గురువారం చావునీ డివిజన్‌లోని గుడ్డిబౌలి నిర్వహించిన ఉచిత వైద్య పరీక్షా శిబిరం, దంత పరీక్షలను ఆయన డివిజన్ కార్పొరేటర్ సలాం షాహిద్‌తో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే వైద్యులను సంప్రదించడం అలవాటు చేసుకోవాలన్నారు.

ఆలయాల వద్ద యుద్ధప్రాతిపదికన పనులు

సైదాబాద్, జూలై 10(ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాలు నిర్వహించే ఆలయాల వద్ద జీహెచ్‌ఎంసీ యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించిందని ఐఎస్ సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి అన్నారు. గురువారం సింగరేణికాలనీ, ఇంద్రప్రస్తకాలనీ, పెద్దతోట, పూర్ణోదయ కాలనీల్లో అమ్మవారి ఆలయాల వద్ద బోనాల ఏర్పాట్ల అభివృద్ధి పనులను ఆమె ప్రారంభించారు. డివిజన్ పరిధిలో బోనాలు నిర్వహించే ఆలయాల వద్ద, రోడ్ల మరమ్మతులు, రంగులు వేయడం, వీధి దీపాలు అమర్చడం వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

తాళ్లచెరువులో అక్రమ నిర్మాణాలు కూల్చివేత



తాళ్లకుంటలో నిర్మించిన ప్రీకాస్టు వాల్‌లను తొలగిస్తున్న ఇరిగేషన్ అధికారులు

హయత్‌నగర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని తాళ్లకుంటలో కొందరు వ్యక్తులు ప్లాట్లకు ప్రీకాస్టు వాల్‌లను నిర్మిస్తుండగా స్థానికులు ఇరిగేషన్ అబ్దుల్లాపూర్‌మెట్ ఏఈ వంశీధర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం తాళ్ల చెరువును ఏఈ సందర్శించి వాస్తవ పరిస్థితిని చూశారు. వెంటనే ఎక్సకవేటర్ సహాయంతో ప్రీకాస్టు వాల్‌లను కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాళ్లచెరువులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని అన్నారు. ఎవరైనా నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో టీబీ ముక్త్ అభియాన్ వైద్య శిబిరం

హయత్‌నగర్, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం హయత్‌నగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా టీబీ రోగులకు ఉచితంగా నిత్యావసర వస్తువులు, మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2025వరకు దేశంలో టీబీని పూర్తిగా నిర్మూలించాలనే ఉద్దేశంతోనే ప్రధానమంత్రి ఈ కార్యక్రమాన్ని తీసుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా 200మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి పాపారావు, వైద్యులు మిసభ షహీన్, హరీష్, సోహెల్, సాగర్, వంశీ,వినోద, మంజుల, పార్వతి, బీజేపీ నాయకులు ఎల్లప్ప, మహేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

రూ.34లక్షలతో మూడు ఓపెన్ జిమ్‌లు

కొత్తపేట, జూలై 10(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్‌లో రూ.34లక్షలతో మూడు ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన ఎస్‌ఆర్‌ఎల్ కాలనీలో తెలంగాణ పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మరో రెండు జిమ్‌లు సత్యానగర్ వాకింగ్‌ట్రాక్ స్థలంలో, ప్రజయ్‌నివాస్ -1లలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. పనులను జీహెచ్‌ఎంసీ ఏఈ షరీఫ్ తదితర అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో హైడ్రా టీమ్ మార్షల్ వీరయ్య, ఇన్‌చార్జి పవన్, నాయకులు రాజేష్, అశ్విన్‌సింగ్, ప్రదీప్‌కుమార్, మహేష్ పాల్గొన్నారు.



విద్యార్థులకు నిబంధనల ప్రాధాన్యతను వివరిస్తున్న టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాచపుడి

విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలి

కొత్తపేట, జూలై 10(ఆంధ్రజ్యోతి): చిన్ననాటి నుంచే విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ రాచపుడి తెలిపారు. గురువారం శివగంగకాలనీలోని ఓ ప్రైవేటు స్కూల్ నుంచి 95మంది విద్యార్థులు రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. వారికి లెక్చర్ హాల్‌లో వీడియోలు, రైమ్స్ ప్రదర్శిస్తూ నిబంధనలపై అవగాహన కల్పించారు. కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎస్‌ఐ నర్సింహారావు, ఆర్‌ఎస్‌ఐ సంతోష్‌కుమార్ సాధారణ ప్రజలకు, డ్రైవర్లకు రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనల ప్రాధాన్యతలపై అవగాహన కల్పించారన్నారు. కుంట్లూరులో రెండు, అబ్దుల్లాపూర్‌మెట్ తారామతిపేటలో రెండు ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తపేట, చైతన్యపురి ప్రాంతాల్లో మూడు ప్రైవేటు విద్యాసంస్థల్లో నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారన్నారు.

49 మంది మద్యంప్రియులకు డీడీ కౌన్సెలింగ్

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 49మంది మద్యంప్రియులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో టీటీఐ లెక్చర్ హాల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ ఎస్‌పీఓ అమరవర్ధన్‌రెడ్డి, ఎస్‌ఐ ఎస్‌ఓపీ అల్లూరయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రజాపాలనలో దివ్యాంగులకు స్వర్ణయుగం

ఓల్డ్‌మలక్‌పేట, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనలో రాష్ట్రంలోని దివ్యాంగులకు స్వర్ణయుగమని దివ్యాంగుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి సంవత్సరం పూర్తిచేసుకున్న సందర్భంగా గురువారం మలక్‌పేటలోని దివ్యాంగుల సంక్షేమశాఖ కార్యాలయంలో దివ్యాంగ సంఘాల ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తాను చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో దివ్యాంగులకు 15 రకాల నూతన సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన దివ్యాంగ సంఘాల నాయకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అల్కాపురి సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకల్లో టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సురేఖ దంపతులు



ప్రశాంత్‌నగర్‌లోని సాయి ఆలయంలో కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి, వేములయ్యగౌడ్, రామారావు, ఆలయ కమిటీ ప్రతినిధులు



మీర్‌పేట్ నల్లపోచమ్మ ఆలయంలో గురువుకు పాదపూజ చేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాములుయాదవ్



నాగోల్‌లోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న కార్పొరేటర్ అరుణాసురేంద్రనాథ్‌యాదవ్

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

జోన్‌బృందం : గురుపౌర్ణమి వేడుకలను గురువారం ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దిల్‌సుఖ్‌నగర్‌లోని షిరిడీ సాయి సంస్థాన్ ప్రత్యేక శోభను సంతరించుకుంది. ప్రత్యేక అలంకరణల నడుమ స్వర్ణ సింహాసనంపై కొలువుదీరిన సాయిబాబా దర్శనంతో భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.



నాగోల్‌లో బాబాకు అభిషేకం చేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గుప్తా, స్వప్న దంపతులు

స్పీకర్ ప్రత్యేక పూజలు..

తెలంగాణ శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఏసీబీ డైరెక్టర్ తరుణ్‌జోషి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, తెలంగాణ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, యెగ్గె మల్లేషంలు దిల్‌సుఖ్‌నగర్ సంస్థాన్‌ను సందర్శించి బాబా వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అల్కాపురికాలనీ సాయిబాబా మందిరంలో టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సురేఖ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



శ్రీరామ్‌నగర్ కాలనీలోని బాబాకు క్షీరాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి, లత దంపతులు

రంగారెడ్డి జిల్లా కోర్టులో..

రంగారెడ్డి జిల్లా కోర్టులో గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా కృషి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ఇతర ప్రతినిధులు, పాల్గొన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ద్వారక షిరిడీ, అనాజ్‌పూర్‌లోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక హారతి కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. సైదాబాద్‌లోని లక్ష్మీనగర్‌కాలనీ, సాయిరాంకాలనీ సాయిబాబా ఆలయాలలో, మీర్‌పేట్‌లోని నల్లపోచమ్మ ఆలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సాయినాథుడి పూజల్లో కార్పొరేటర్లు భాగ్యలక్ష్మిరెడ్డి, అరుణరెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి



బాబా వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



భక్తులతో కిటకిటలాడుతున్న సంస్థాన్ ఆవరణ



ద్వారక షిరిడీ ఆలయంలో అన్నదానంలో పాల్గొన్న భక్తులు

పదవుల్లో అసలైన నాయకులకు తీవ్ర అన్యాయం

- ఇష్టం వచ్చినట్లుగా పదవుల పంపకాలు
- ఇలా అయితే ఎల్బీనగర్‌లో కాంగ్రెస్ మనుగడ ప్రశ్నార్థకమే !
- టీపీసీసీ ఎల్బీనగర్ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి
- టీపీసీసీ అధ్యక్షుడిని కలిసి విన్నపం

మన్సూరాబాద్, జులై 10(ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడిగా పార్టీని నమ్ముకుని ఎన్ని ఇబ్బందులు ఎదురైనా కాంగ్రెస్ పటిష్టతే ముఖ్యమని పనిచేసిన ఎల్బీనగర్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలకు తీవ్ర నష్టం జరుగుతోందని టీపీసీసీ ఎల్బీనగర్ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ, మార్కెట్ కమిటీ, ఇతర పదవుల్లో అనేక సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీనే నమ్ముకుని పనిచేసిన కార్యకర్తలకు కాకుండా ఇటీవల పార్టీలో చేరిన వారికే కట్టబెట్టడం కాంగ్రెస్ మనుగడయే ప్రశ్నార్థకంగా మారక తప్పదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇష్టారాజ్యంగా తమకు నచ్చిన వ్యక్తులకు కొందరు నాయకులు పదవులు కట్టబెట్టి అసలైన వారికి అన్యాయం చేస్తున్నారన్నారు. పదేళ్లుగా పార్టీ పటిష్టతకు పాటుపడ్డ నాయకులు, కార్యకర్తలకు అధికారంలోకి వచ్చాక సముచిత గౌరవం ఇస్తామని హైకమాండ్ చెప్పిందని, కానీ ఎల్బీనగర్‌లో అందుకు విరుద్ధంగా జరుగుతుందని వాపోయారు. డివిజన్ పార్టీ అధ్యక్షులు, ఇతర పదవులను అసలైన నాయకులకు కట్టబెట్టి ఎల్బీనగర్‌లో పార్టీ మనుగడ సాగించేలా కాపాడాలని అధ్యక్షుడిని కోరారు.



టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు పార్టీ స్థితిగతుల గురించి చెబుతున్న ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఈఆర్‌ఓ, ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి


ఎన్నికల విధుల్లో బీఎల్‌వోలది కీలకపాత్ర

- ఈఆర్‌ఓ జగదీశ్వర్‌రెడ్డి

ఎల్‌బీనగర్/సరూర్‌నగర్, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఏ ఎన్నికలు జరిగినా ఆ సమయంలో బీఎల్‌వోలు(బూత్ లెవెల్ ఆఫీసర్లు) కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని, ఈ దృష్ట్యా బీఎల్‌వోలు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని కందుకూరు మహేశ్వరం నియోజకవర్గం ఈఆర్‌ఓ, ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి సూచించారు. గురువారం లింగోజిగూడ జ్యోతి క్లబ్‌లో, బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో బూత్‌స్థాయి అధికారుల జాతీయ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, జిల్లా స్థాయి అధికారి వెంకట్‌లు పాల్గొని బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా విధులు నిర్వహించడానికి సిద్ధంగా ఉండాలని, ఉన్నతాధికారులు అప్పగించిన విధులను సక్రమంగా, సజావుగా నిర్వహించాలని అన్నారు. బీఎల్‌వోలు నజర్ నక్షా, కొత్త ఓటర్ల నమోదు, జాబితా నుంచి మరణించిన ఓటర్ల తొలగింపు, పోలింగ్ బూత్‌ల నిర్ధారణ, ఓటరు సమాచార స్లిప్పులు(వీఐఎస్) తయారీ, స్లిప్పుల పంపిణీ, పోలింగ్ రోజు బూత్‌ల వద్దకు రాలేని ఓటర్ల వివరాలతో కూడిన జాబితా తయారు చేయడం వంటి విధులపై ప్రత్యేక దృష్టి సారించాలని వారు సూచించారు. కార్యక్రమంలో సరూర్‌నగర్ తహసీల్దార్ వేణుగోపాల్, బాలాపూర్ తహసీల్దార్ ఇందిరాదేవి, ఏఎంసీ శ్రీనివాసరావు, నాయబ్ తహసీల్దార్‌లు జంగయ్య, మణిపాల్‌రెడ్డి, ఆర్‌ఐ సహదేవ్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, ప్రతాప్‌రెడ్డి, చైతన్య, ఆనంద్‌కుమార్, మకత్‌లాల్, చెవుల నవీన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినుల కిడ్నీలు దెబ్బతింటున్నయ్

- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇబ్రంశేఖర్



ఆంధ్రజ్యోతి వార్తా కథనాన్ని చూపుతున్న బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇబ్రంశేఖర్

కొత్తపేట, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్లు లేకపోవడం వల్ల విద్యార్థినుల కిడ్నీలు దెబ్బతింటున్నాయని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇబ్రం శేఖర్ అన్నారు. గురువారం కామినేని - సీరీస్ దారిలో గల తమ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎక్కువ శాతం ప్రభుత్వ పాఠశాలల్లో బహుజన విద్యార్థినులే చదువుకుంటున్నారని సరైన సదుపాయాలు లేక వారు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని, కిడ్నీ సమస్యలతో అస్వస్థతకు గురవుతున్నారని పేర్కొన్నారు. 6 నెలల్లో 106 మంది విద్యార్థులకు కిడ్నీ సమస్యలున్నట్లు ఉస్మానియా ఆస్పత్రి వైద్యులు వెల్లడించారని ఆయన గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఆంధ్రజ్యోతి సహా వార్తా పత్రికల్లో ప్రచురితమైన వార్తా కథనాలను ఆయన ఉదహరించారు. విద్యార్థినుల కిడ్నీ సమస్యలకు కారణం ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్లు లేకపోవడం, దీంతో విద్యార్థినులు తగినన్ని నీరు తాగలేని దుస్థితి కొనసాగుతోందని వివరించారు. నీరు తాగితె టాయిలెట్లకు వెళ్లాల్సి వస్తుందని, అందుకే ఆయా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులు కిడ్నీ సమస్యలతో అనారోగ్యానికి గురవుతున్నారని వైద్యులు స్పష్టం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఈ దుస్థితి నెలకొనడం చాలా దారుణమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బహుజన విద్యార్థినుల పట్ల ప్రభుత్వాలకు, ప్రతిపక్ష పార్టీలకూ ఎందుకు అంత చులకన భావం ఉందని ఆయన ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులకు టాయిలెట్లు ఇతర సదుపాయాలు కల్పించాలని డిమాండు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో బహుజన పిల్లలను కాపాడేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా బీఎస్పీ తీవ్ర చర్యలు చేపడుతుందని హెచ్చరించారు. గురుపౌర్ణమి సందర్భంగా జ్యోతిరావుఫూలే, డా.బీఆర్ అంబేడ్కర్, కాన్షీరాం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ప్రభుత్వ పాఠశాలలో కిచెన్ షెడ్డులోని పరిస్థితిని పరిశీలిస్తున్న ఆడిట్ అధికారులు

పారిశుధ్య నిర్వహణపై ఆడిట్ బృందం తనిఖీలు

హయత్‌నగర్, జూలై 10(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణపై ఆడిట్ బృందం గురువారం తనిఖీలు నిర్వహించింది. ప్రత్యేక తనిఖీ బృందం అధికారి మహ్మద్‌ఖాజా, శానిటరి ఇన్‌స్పెక్టర్ వినయ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ సురేష్‌తో కలిసి బృందం అధికారులు రోడ్ల శుభ్రత, వాటర్ ట్యాంకులను పరిశుభ్ర పరిచే ప్రక్రియ, డివైడర్లపై మొక్కలు తొలగింపు, ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల నిర్వహణ, కిచెన్, టాయిలెట్ల పరిస్థితి, కంపోస్టు యార్డుల నిర్వహణ, తడి, పొడి చెత్త వేరుచేయడం, వనమహోత్సవంలో నాటిన మొక్కల పరిస్థితిని పరిశీలించారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో జరుగుతున్న పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలను సమీక్షించారు. ఈ సందర్భంగా కొహెడ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ పరిరక్షణ, కాలుష్యంపై స్వచ్ఛత పోటీలను నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మహ్మద్ ఖాజా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వార్డు అధికారులు బాలరాజు, శేఖర్, రాకేష్, మోహన్, జవాన్లు మురళి, నాగేష్, సుధాకర్, శివ పాల్గొన్నారు.

సీబీఎస్‌లో టికెట్ బుకింగ్ కౌంటర్ ప్రారంభం

చాదర్‌ఘాట్: ఆర్టీసీ సీబీఎస్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన టికెట్ బుకింగ్ కౌంటర్‌ను రంగారెడ్డి రీజినల్ మేనేజర్ శ్రీలత గురువారం పారంభించారు. ఈకౌంటర్ ద్వారా హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పాటు బెంగళూరు, చెన్నై, ముంబాయి, పుణే, గాణుగాపురంతోపాటు ఇతర రాష్ట్రాలకు వెళ్లే అన్ని రకాల బస్సులకు రిజర్వేషన్ సేవలను ఈ కౌంటర్ ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు శ్రీలత తెలిపారు.

మలక్‌పేట నుంచి జీపీవో, నాంపల్లి వైపు వెళ్లే వాహనదారులు చాదర్‌ఘాట్ బ్రిడ్జిపై నుంచి వెళ్లొద్దు

- ట్రాఫిక్ డీసీపీ వెంకటేశ్వర్లు

చాదర్‌ఘాట్ : చాదర్‌ఘాట్ బ్రిడ్జిపై పెరుగుతున్న వాహనాల రద్దీ నివారణకు మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందుకు గాను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లాలని సూచిస్తూ గురువారం నుంచి వాహనదారులకు తెలియజేసేలా బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. ఈ వివరాలను సౌత్ ఈస్ట్ జోన్ ట్రాఫిక్ డీసీపీ వెంకటేశ్వర్లు పరిశీలించి వెల్లడించారు. మలక్‌పేట నుంచి చాదర్‌ఘాట్ బ్రిడ్జి మీదుగా జీపీవో, నాంపల్లి వైపు కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, ఇతర వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలైన ఆర్టీసీ ఎంజీబీఎస్, దారుషిఫా, ఎస్‌జే రోటరీ, అఫ్జల్‌గంజ్, ఎంజే మార్కెట్ మీదుగా వెళ్లాలని ఆయన సూచించారు. మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు సూచించిన ప్రత్యామ్నాయ మార్గాలను తెలియజేసే బోర్డులను మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్‌తో కలిసి ట్రాఫిక్ డీసీపీ పరిశీలించారు.

డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో జాప్యంపై ఆగ్రహం

- అసంపూర్తి ఇళ్లలోకి లబ్ధిదారుల ప్రవేశం
- సర్దిచెప్పి ఖాళీ చేయించిన అధికారులు

సరూర్‌నగర్, జూలై 10(ఆంధ్రజ్యోతి): 'ఏడెనిమిదేళ్లుగా ఎదురు చూస్తున్నాం.. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం ఇంకెన్నడు పూర్తి చేస్తారు.. మాకెప్పుడు అప్పగిస్తారు?' అని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నిర్మాణ పనులు పూర్తి కాకున్నా సరే మేము ఈ ఇళ్లలోనే ఉంటాం.. బయట కిరాయి కట్టలేక పోతున్నాం' అంటూ పలువురు లబ్ధిదారులు ఏకంగా సదరు ఇళ్లలోకి సామానుతో సహా ప్రవేశించారు. దాంతో కాసేపు అక్కడ గందరగోళ పరిస్థితి తలెత్తింది. మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ కార్పొరేషన్‌లో గురువారం ఈ సంఘటన చోటుచేసుకుంది. ఇక్కడి లెనిన్‌నగర్‌లోని సర్వే నంబర్.119లో గతంలో గుడిసెల్లో నివసించిన వారికి కేటాయించే నిమిత్తం డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టారు. అప్పట్లో 231మంది గుడిసెవాసులను గుర్తించి పట్టాలు మంజూరు చేశారు. కాగా అనంతరం ఆజాబితా 255 కి చేరింది. 2020- 21లో అప్పటి విద్యాశాఖమంత్రి సబితారెడ్డి ఇక్కడ భారీ సభ ఏర్పాటు చేసి కేవలం 80మందికి మాత్రమే లాటరీ ద్వారా ఇళ్లు కేటాయించి, మిగతా వారికి త్వరలోనే అందజేస్తామని హామీ ఇచ్చారు. అయితే ఎనిమిదేళ్లు గడిచినా వాటి నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఓపిక నశించిన లబ్ధిదారుల్లో 32మంది గురువారం ఇంటి సామానుతో సహా వచ్చి శ్లాబులు వేసి గోడలు కట్టిన ఇళ్లలోకి ప్రవేశించారు. విషయం తెలుసుకున్న స్థానికులు వారిని స్థానికేతరులు అంటూ అడ్డుకోవడానికి ప్రయత్నించారు. దాంతో కాసేపు గందరగోళం ఏర్పడి పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసింది. అయితే లబ్ధిదారులు తమ వద్ద ఉన్న పట్టాలను చూపించడంతో స్థానికులు వెనక్కి తగ్గారు. అనంతరం బాలాపూర్ తహసీల్దార్ ఇందిరాదేవి తమ సిబ్బందితో అక్కడకు చేరుకోగా, మీర్‌పేట్ పోలీసులు సైతం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చూస్తామని అధికారులు సర్దిచెప్పడంతో లబ్ధిదారులు వెనక్కి తగ్గారు. అధికారుల హామీ మేరకు ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోయారు.



ఇళ్ల కేటాయింపు ఇంకెన్నడు చేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మహిళలు



డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద గుమికూడిన లబ్దిదారులు, స్థానికులు

ప్రభుత్వం మా గోడు పట్టించుకోదా?

ప్రభుత్వం తమ గోడు పట్టించుకోవడం లేదని, దశాబ్దకాలంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం నిరీక్షిస్తున్నా నేటికీ వాటి నిర్మాణం పూర్తి చేయడం లేదని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం లెనిన్‌నగర్‌కు వచ్చిన పలువురు మహిళలు తమకు అప్పట్లో పంపిణీ చేసిన ఇళ్ల పట్టాలను చూపించి మాట్లాడుతూ ఈ పట్టాలు ఇంట్లో పెట్టుకుని ఎన్నేళ్లు అద్దె ఇళ్లలో ఉండాలని ప్రశ్నించారు. 255 మందిలో 80మందికి ఇళ్లు కేటాయించి చేతులు దులుపుకుంటే సరిపోతదా?.. మేం సొంతిళ్లలోకి వెళ్లొద్దా? అని వారు నిలదీశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ ఇబ్బందులను గుర్తించి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం తొందరగా పూర్తి చేయించి తమకు అప్పగించాలని వారు డిమాండ్ చేశారు.

ఓయో హోటల్‌పై పోలీసుల దాడులు

- మహిళ, నలుగురు వ్యక్తులు అరెస్ట్

సైదాబాద్, జూలై 10(ఆంధ్రజ్యోతి): చంపాపేట ప్రధాన రహదారిపై ఉన్న డీ అల్ఫాబెట్ ఓయో హోటల్‌పై బుధవారం రాత్రి విశ్వాసనీయ సమాచారం మేరకు సైదాబాద్ పోలీసులు దాడులు చేశారు. గుట్టుచప్పుడు కాకుండా ఓ గదిలో వ్యభిచారం చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. యువతిని రెస్క్యూ హోంకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని దివ్యాంగుడి అదృశ్యం

హయత్‌నగర్ : మతిస్థిమితం లేని మూగ, చెవిటి యువకుడు అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్ డివిజన్‌లోని ముదిరాజ్ కాలనీలో తల్లి వద్ద ఉంటున్న కుంభ మురళీకృష్ణ(28) మతిస్థిమితం సరిగా లేదు, మూగ, చెవిటి అయిన యువకుడు జూన్ 27న మధ్యాహ్నం బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లి తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో గురువారం సాయంత్రం తల్లి హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టాస్క్‌ఫోర్స్ పోలీసులమని బెదిరించి దోపిడీ చేసిన కేసులో మరో ఇద్దరి అరెస్ట్

చాదర్‌ఘాట్, జూలై 10(ఆంధ్రజ్యోతి): కంపెనీ సీఎస్‌ఆర్ ఫండ్‌గా రూ.కోటి ఇప్పిస్తామని నమ్మించి టాస్క్‌ఫోర్స్ పోలీసులమని బెదిరించి రూ.50లక్షల నగదును దోపిడీ చేసి పారిపోయిన ముఠాలో మరో ఇద్దరిని మలక్‌పేట పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఈ కేసుతో సంబంధమున్న మరో ముగ్గురి కోసం పోలీసులు గాలిస్తున్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన వహీద్, చాంద్రాయణగుట్ట నివాసి షాబాజ్‌లు అరెస్టయిన వారిలో ఉన్నారు. దోపిడీ కేసుతో సంబంధమున్న 14మంది ముఠాలో మొదట్లో 9మంది నిందితులను అరెస్టు చేయగా తాజాగా మరో ఇద్దరిని అరెస్టు చేశారు. దీంతో ఇంత వరకు అరెస్టయిన వారి సంఖ్య 11కు చేరింది.